
# జిలేబి

ఒకరు ఒక పనిని ఎనిమిది గంటల కాలంలో పూర్తి చేస్తే, యిద్దరు అదే పనిని ఎంతకాలంలో పూర్తిచేస్తారు? లేదా అదే రకమైన రెట్టింపు పనిని ఒకరెంత కాలంలో పూర్తి చేస్తాడు? విలోమ సూత్ర ప్రకారం మొదటి ప్రశ్నకు నాలుగ్గంటలూ, అనులోమ సూత్ర ప్రకారం రెండో ప్రశ్నకు పదహారు గంటలూ అని సమాధానాలు. ఈ లెక్కలు చేసేటప్పుడు వ్యక్తుల మధ్య శక్తి, సామర్థ్యాల తేడా కాని, లేబర్ కమీషనర్ రూల్సు కాని పరిగణనలోకి తీసుకోబడలేదు.

ఒక వ్యక్తి పదహారు గంటలు పనిచేసి ఓ పనిని పూర్తి చేస్తే, ఆధునిక నిర్వచనం ప్రకారం ఆ పనికి పదహారు మేన్ అవర్స్ అంటే మనిషి గంటలు (శ్రమ సమయం) కావాలి. నియమాల ప్రకారం ఒక మనిషి రోజుకి ఎనిమిది గంటల కంటే ఎక్కువ పని చేయడు. చేయించరాదు కూడా. ఎనిమిది గంటల శ్రమ సమయాన్ని ఒక రోజుగా పరిగణిస్తే పై పనిని ఒక వ్యక్తి రెండు రోజుల్లోనూ, యిద్దరు వ్యక్తులు ఒక రోజులోనూ చేస్తారు. అంటే ఈ పనికి రెండు మేన్ డేస్ అంటే మనిషి రోజులు(శ్రమ దినాలు) కావాలి. అయితే యిక్కడో చిన్న మెలిక ఉంది. ఒక్కోసారి పని యొక్క స్వభావం యిద్దరు వ్యక్తుల్ని ఒకేసారి నియమించడానికి వీలు కాదు. వరుసక్రమంలో ఒక క్రియ తర్వాత మరొక క్రియ నిర్వహించవలసిననప్పుడు యిద్దరు మనుషుల్ని ఒకేసారి పనిలో పెట్టడం వల్ల ప్రయోజనముండదు. అందుకని ఆ పనిని ఒకే మనిషి చేత రెండు రోజులు చేయించడం కాని, ఆ వ్యవధి వీలు కాని పక్షంలో అదే రోజున రెండో షిఫ్టులో మరొక వ్యక్తిని నియమించడం కాని చెయ్యాలి.

పరిశ్రమలలో ఉద్యోగాల్ని సృష్టించడంలో పైన చెప్పిన మౌలిక అంశాల్ని గణనలోకి తీసుకోవలసి వస్తుంది. నిన్న మొన్నటి వరకు ఇండస్ట్రియల్ రిలేషన్స్ అంటే ఔద్యోగిక సంబంధాలు అని వ్యవహరించబడిన శాఖ ఈ రోజున హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ (హెచ్ఆర్‌డి) - అంటే మానవ వనరుల శాఖగా వ్యవహరింపబడ్తోంది. ఈ శాఖ సంస్థాగతమైన ఉద్యోగాల్ని సృష్టించడంలోనూ, తగిన శిక్షణ యివ్వడంలోనూ శ్రద్ధ వహిస్తుంది. మిగిలిన శాఖలనన్నింటినీ సవాలక్ష ప్రశ్నలు వేసి చికాకులు పెట్టేస్తుంది. యక్ష ప్రశ్నలకి జవాబులు చెప్పడం సులువేమో కాని ఈ ప్రశ్నలకి సమాధానాలివ్వడం చాలా కష్టతరమైన పని. ఎందుకంటే చాల సందర్భాలల్లో సమాధానాలు వండాలి.



వార్షిక ఉత్పత్తుల పరిమాణాన్ని ధ్యేయంగా పెట్టుకొని, నెలసరి, దినసరి ఉత్పత్తుల లక్ష్యాన్ని నిర్ణయించడం జరుగుతుంది. ఆ దినసరి లక్ష్యాన్ని సాధించడం కోసం ఒక మనిషి ఎనిమిది గంటలు పని చెయ్యవలసి ఉంటే ఒక మనిషికి ఉద్యోగం కల్పించాలి. పది గంటలైతే ఆ మనిషికి ప్రతిరోజూ అదనపు బత్తెమిచ్చి పని చేయించాలి. పది గంటల మాటటుంచి, ఒక వ్యక్తి నిర్విరామంగా ఎనిమిది గంటలు పని చెయ్యగలడా? లేదు! అందుకని కాఫీ, టీ, లంచ్ బ్రేక్‌లు యివ్వాలి.

ఉద్యోగుల హోదాతో నిమిత్తం లేకుండా మానవ నైజాన్ని పరిగణనలోకి తీసుకొంటే కొన్ని విషయాలు ద్యోతకమవుతాయి. అధిక శాతం ఈ విరామ సమయాన్ని అటూ, యిటూ కూడా పెంచేస్తారు! దినసరి లక్ష్యాన్ని చేరుకోవడానికి నియమించబడ్డ ఉద్యోగి, అధికార విరామ సమయం మినహాయించి మిగిలిన సమయాన్ని వృధా చెయ్యకుండా శ్రమించాలి. అయితే ప్రపంచ వ్యాప్తంగా జరిగిన గణాంకాల్ని దృష్టిలోకి తీసుకొంటే, మూడు గంటలు శ్రమించిన తర్వాత మనిషి శక్తి సామర్థ్యాలూ, ఆసక్తీ సన్నగిల్లిపోతాయట. అదీకాక ఆ ఒక్క మనిషీ అస్తమానూ అందుబాటులో ఉండడానికి సాధ్యం కాదు. రోగమొస్తుంది. రొచ్చొస్తుంది. చుట్టాలొస్తారు. శుభాశుభకార్యాలకి సెలవు మీద వెళ్ళవలసి వస్తుంది. ఈ కారణంగా సెలవు కేటాయింపు కూడా దృష్టిలో ఉంచుకోవాలి.

యిన్ని కారణాలు నేపథ్యంలో ఉన్నా, కేవలం లెక్కల ప్రకారం ఒక పనికి పది మనిషి గంటలు (పది గంటల మనిషి శ్రమ సమయం) కావలిస్తే, ఒక్కడి చేతనే సంవత్సరం పొడుగునా ప్రతిదినమూ పనిచేయడానికి నియమాలు అడ్డం వస్తాయి కాబట్టి, యిద్దరికి

ఉద్యోగమివ్వడం జరుగుతుంది. విలోమ సూత్ర ప్రకారం ఆ యిద్దరూ ఆ పనిని అయిదు గంటల్లో పూర్తి చేస్తే నిర్ణీతమైన అర్థగంట లంచ్ బ్రేక్‌ని గణనలోకి తీసుకోకపోతే రెండు మూళ్ళు ఆరు మనిషి గంటలూ, తీసుకొంటే రెండు రెండున్నర అయిదు మనిషి గంటలూ వృథాగా పోతాయి. అందుకని లక్ష్యాన్ని పెంచడమో, కొత్త పనులను అదనంగా సృష్టించడమో జరుగుతుంది. యిది జరిగిన మరుక్షణం సమస్య మళ్ళీ మొదటికి వస్తుంది. యిద్దరికి పనెక్కువ అయిపోతుంది. మూడోవాణ్ణి పెట్టడంతో ముగ్గురికి పని తక్కువ అవుతుంది. మళ్లీ ఉత్పత్తులను పెంచడమో, అదనపు శాఖల్ని ప్రారంభించడమో జరుగుతుంది. 'పార్కిన్సన్స్ లా' అంటే యిదే!

కానైతే లెక్కలు కట్టటం వరకే పరిమితమైన ఈ అనులోమ, విలోమ సూత్రాలు కొంతవరకూ కావలసిన ఉద్యోగుల సంఖ్యని అంచనా వెయ్యడానికి సహకరిస్తాయి. కాని ప్రభుత్వ, ప్రైవేటు రంగాల యజమాన్య ధోరణులూ, ఉద్యోగుల నైజాలూ, పరిసరాలూ, రాజకీయ పరమైన జోక్యాలూ, ఉద్యోగుల సంఘాలూ ఈ అంచనాల్ని తీవ్రంగా దెబ్బ తీస్తాయి. పారిశ్రామిక కర్మాగారాల్లోనూ, యంత్రాగారాల్లోనూ లక్ష్యసాధనకు కావలసిన ఉద్యోగుల సంఖ్యని అటూ, యిటూగా నిర్ణయించ కలిగినా, ఫైళ్ళతో నడిచే పాలనా యంత్రాంగంలో ఉద్యోగుల సంఖ్య నిర్ణయించడం చాలా కష్టమనే చెప్పుకోవాలి.

తులసీదాసుకి ఈ విషయాలన్నీ ఆలోచించి, ఆలోచించి బుర్ర వేడెక్కిపోయింది. సంస్థ ప్రధాన కేంద్రంలో పనిచేసే వాళ్ళ మీద అంతులేని కోపమొచ్చింది. చివరిసారిగా మానవ వనరుల శాఖ మెంబర్‌కి చాలా ఘాటుగా ఓ ఉత్తరాన్ని డ్రాఫ్ట్ చేసి, రీజియనల్ డైరెక్టర్ విభీషణ శర్మ బల్ల మీద ఉంచాడు. విభీషణ శర్మ ఉత్తరాన్ని మౌనంగా చదివాడు.

ఆయన డ్రాఫ్ట్ ఉత్తరం చదవడం ముగించిన తర్వాత తులసీదాసు అన్నాడు.

'మానవ నైజాన్ని గణనలోకి తీసుకోకుండా మానవ వనరుల శాఖ చెప్పినదే వేదంగా తీసుకున్నా కూడా – నా విభాగంలో పదిమంది ఆఫీసర్లకి, ముప్ఫైమంది టెక్నీషియన్స్‌కి చేతి నిండా పని ఉంది. ఒక్కొక్క షిఫ్ట్‌లో యిద్దరేసి ఆఫీసర్లూ, పదిమంది టెక్నీషియన్సూ పని చెయ్యాలి. యిక్కడ ఆఫీసులో ఆ మూడు షిఫ్ట్‌లనీ నిరంతర పర్యవేక్షణ చెయ్యడం కోసం ముగ్గురు ఆఫీసర్లు కావాలి. వీరందరినీ అజమాయిషీ చేసే నాకు టెక్నికల్ సెల్‌లో చేదోడు వాదోడుగా ఉండేటందుకు ఓ ఆఫీసరు అవసరం ఎంతైనా ఉంది.

'అందరూ వేసవిలోనే సెలవుల మీద స్వగ్రామాలకి ప్రయాణం చేసే మన దేశంలో కనీసపు లీవ్ రిజర్వ్ ఉద్యోగులు లేకుండా, లేదా ఉన్నవారికి సెలవు మీద వెళ్ళడానికి అనుమతినివ్వకుండా ఎంతకాలం పని చేయించకలగుతామన్న విషయం వాళ్ళు పూర్తిగా విస్మరించినట్లుంది.

'ప్రస్తుతం నా సెక్షన్లో ఉన్నది అరుగురు జూనియర్ ఆఫీసర్సు, యిరవై మంది టెక్నీ

షియన్స్ మాత్రమే! పశ్చిమ ప్రాజెక్టు నుంచి బదిలీ చేసిన యిద్దరు ఆఫీసర్లు ఏడాది క్రితమే యిక్కడికి రావల్సి ఉంది. యింతవరకూ వాళ్ళు రాలేదు. వాళ్ళ బదిలీలకి ఉత్తర్వులిచ్చిందీ వాళ్ళే, ఆపుచేసిందీ వాళ్ళే!నాకు నిర్ణయించిన ఉత్పత్తుల లక్ష్య సాధన కోసం నిర్ధారించిన సంఖ్య ప్రకారం ఉద్యోగుల్ని సమకూర్చని పక్షంలో, జరిగే దానికి బాధ్యత నాదీ కాదు, ఈ ప్రాజెక్టుదీ కాదు'

"తులసీదాసు రామాయణాన్ని చాలా శ్రావ్యంగా తిరగ వ్రాస్తే, నువ్వీ ఉత్తరాన్ని చాలా ఘాటుగా వ్రాశావు! కేంద్రస్థావరంతో వివాదం అంత మంచిది కాదేమో?" అన్నాడు తలపండిన విభీషణశర్మ.

"కేంద్ర స్థావరంతో సంఘర్షణ మంచిది కాదనుకొంటే యిక్కడ యమ యాతన పడి నా లక్ష్యాన్ని సాధించలేం. మానవ వనరులు సరిపోని కారణంగా ప్లాంట్‌ని పూర్తిగా ఉపయోగించుకోలేం. ఈ విషయంలో, పైవాళ్ళు వ్రాసిన ప్రతీ ఉత్తరాన్నీ మీరు నా బల్ల వద్దకు పంపించేస్తే నేను మట్టుకు ఏం చెయ్యగలను? నా ఒక్క విభాగంలోనే కాదు, మొత్తం ప్రోజెక్టులోనే సంఖ్యాబలం తక్కువుందన్న సంగతి మీకూ తెలుసు."

"అవుననుకో కాని, మంది ఎక్కువైనకొద్దీ మరిన్ని కొత్త సమస్యలు పుట్టుకొస్తాయి. ఈ మన ప్రాజెక్టులో ఉన్న ఖాళీలన్నీ భర్తీ చేస్తూ వాళ్ళు ఉద్యోగుల్ని పంపిస్తే, మన కాలనీలో ఉన్న యిళ్ళు చాలవు. ఊళ్ళో యిళ్ళు అద్దెలకు దొరకవు. దొరికినా మన సంస్థ పేరు చూసి దారుణంగా అద్దెలు తీసుకొంటున్నారు!"

"గత ఏడాది లక్ష్యాన్ని పూర్తి చేయనందుకు కేంద్ర స్థావరం ఛీత్కారం చేస్తూ పంపించిన ఉత్తరాన్ని మీరు జిరాక్సు కాపీలు తీయించి అందరికీ పంపించి చేతులు దులుపుకున్నారు. నా విభాగం ఈ ప్రాజెక్టులో కీలకమైనది కావడం వల్ల నా ప్రమోషన్ కొండెక్కింది. కేంద్ర స్థావరం నుంచి ప్రాజెక్టులకు కాయితాలు పంపించే జూనియర్ కొలీగ్స్ ప్రమోషన్లు సంపాదించారు. యిక్కడ ఒళ్ళు హూనం చేసుకొని పనిచేయడం వల్ల ప్రయోజనం లేదు సార్!" - తులసీదాసు తన మనసులో ఉన్న మాటని చికాకు స్వరంతో వ్యక్తం చేశాడు.

"నీకు ప్రమోషన్ యివ్వనందుకు నా తీవ్రమైన నిరసన తెలియజేస్తూ వ్రాసిన ఉత్తరం సంగతి నీకు తెలుసుగా" అని విభీషణ శర్మ కాస్త బుజ్జగింపుగా అన్నాడు.

"ఆ ఉత్తరం అక్కడ బుట్టదాఖలా అయ్యుంటుంది! సరే, నా ప్రమోషన్ సంగతి అటుంచండి. ఈ అరణ్య ప్రాంతంలో ఉన్న మన ప్రాజెక్టుల అన్ని శాఖల్లోనూ ఉన్న ఖాళీలను భర్తీ చెయ్యడానికి నిరుడు సంవత్సరం ప్రత్యేక ప్రకటనలు చేసి, పరీక్షలు పెట్టి, యింటర్వ్యూలు చేసి ఈ ప్రాంతం వారిని ఓ యిరవై మందిని తీసుకొని మిగిలిన రెండు వందల మందినీ పై ప్రాంతాల నుంచి ఎంపిక చేశారు. ఆ రెండు వందల మందిలోనూ సగానికి పైగా కేంద్ర స్థావరంలోనూ, మిగిలినవారిలో చాలామంది దేశంలోని

యితర పట్టణ ప్రాంతాల్లోనూ సర్దుకుపోగా యిక్కడికి వచ్చి చేరిన వారి సంఖ్య పది - అంటే మన ప్రాజెక్టు పేరు చెప్పి ఉద్యోగాలు భర్తీ చేసి, మనకి యిచ్చిన మనుషుల సంఖ్య మొత్తం ముప్పై మంది! ఈ విషయమై మీరు యిదివరకు వ్రాసిన ఉత్తరానికి జవాబు లేదు! యిప్పుడు నేను మీ ముందుంచిన ఉత్తరంలో ఈ విషయం కూడా ప్రస్తావిస్తూ మీరు నిర్మొహమాటంగా వ్రాయండి. మనుషుల్ని పంపించలేకపోతే లక్ష్యాన్ని తగ్గించమనండి!" - తులసీదాసు కాస్త దురుసుగానే అన్నాడు.

విభీషణ శర్మ కొద్దిగా ఖంగుతిన్నాడు. నిజానికి తను తులసీదాసు తనకన్యాయం జరిగిందన్న అర్జీని పంపాడే కాని, అతని ప్రమోషన్‌పై తను వ్రాసి చూపించిన ఉత్తరాన్ని మట్టుకు పంపలేదు. అలా ప్రత్యేకంగా ఉత్తరాలు వ్రాయడంలో చాలా సాధక బాధకాలుంటాయి. నోటి మాటలతో పని జరిగితే పర్వాలేదు గాని, వ్రాతపూర్వకంగా పంపితే తంటాలు తప్పవు.

యికపోతే, మూకుమ్మడిగా జనాలు వచ్చి పడితే వాళ్ళకి వసతి సౌకర్యాలూ, యితర సదుపాయాలూ చేసే పరిస్థితిలో ప్రాజెక్టు లేదు. అందుకనే భర్తీ చేయబడ్డ మనుషులు యితర ప్రాంతాల్లో సర్దుకొన్నందుకు నిరసనగా మొదట్లో ఓ చిన్న ఉత్తరం వ్రాసి, ఆ తర్వాత నైతికంగా తప్పంతా కేంద్ర స్థావరానిదే అన్నట్లు, నిమ్మకు నీరెత్తినట్టుండిపోయాడు విభీషణశర్మ.

స్థానికులైన కొందరు ప్రముఖులూ, రాజకీయ నాయకులూ, నిరుద్యోగ పట్టభద్రులూ ఈ విషయమై అలజడి లేవదీసి, "మా రాష్ట్రంలో ఉన్న ప్రాజెక్టు కోసమై మా రాష్ట్ర ప్రజలకు తగినన్ని ఉద్యోగావకాశాలు కల్పించకుండా యితర ప్రాంతాల వారిని తీసుకోవడం ప్రథమ తప్పిదం! అలా ఉద్యోగాలు దొరికిన వారిని యిక్కడకు పంపకపోవడం ద్వితీయ తప్పిదం!" అంటూ నిలదీశారు.

విభీషణశర్మ లౌక్యంగా ఆ పెద్దమనుషుల్ని సంస్థ తరపున ఖర్చులు భరించి అసలీ ప్రాంతంలోని ఖాళీలను భర్తీచేయించడం కోసం ప్రత్యేక పథకం రచించిన పెద్దలతో చర్చించడానికి కేంద్ర స్థావరానికి పంపాడు. అక్కడ వీళ్ళకి రాచమర్యాదలూ, అతిథి సత్కారాలు చేసి ఏదో నచ్చచెప్పి తిరిగి పంపించేశారు.

ఈ సమస్య మునుముందులో ఎప్పుడో తప్పక తల ఎత్తుతుందని విభీషణశర్మకు తెలుసు. అది కేంద్ర స్థావరంలోని పెద్ద మనుషులకి ఇబ్బంది కలిగిస్తుంది. అందుకని తనకు తానుగా ఈ విషయాన్ని లేవనెత్తడం యిష్టం లేదు. ఎందుకంటే మెంబరు పదవి కోసం ఆశపడుతున్న విభీషణ శర్మ, కొత్తగా వచ్చిన ప్రస్తుత ఛైర్మన్ కం మేనేజింగ్ డైరెక్టర్ని యిరకాటంలో పెట్టదలచుకోలేదు.

అయితే తక్కువ జనాలతో లక్ష్యసాధన అసంభవమన్న తులసీదాసు మాట నూటికి

నూరు పాళ్ళు నిజం. లక్ష్యాన్ని సాధించకపోయినా తన మెంబరు పదవికి దెబ్బతగిలే ప్రమాదం లేకపోలేదు. రెండు మార్గాల్లోనూ నష్టమే పొంచి చూస్తోంది. ఆలోచనలో పడ్డ విభీషణ శర్మ మొహంలోకి చూశాడు తులసీదాసు. కొంత గ్రహించగలిగాడు.

"అవును సార్, యిందాకా మీరు చెప్పిందీ నిజమే. వచ్చిన వాళ్ళకి వసతి సౌకర్యాలు లేకపోతే మనస్థిమితంగా పని చెయ్యలేరు. అదీ మంచిది కాదు. అందుచేత సమన్వయం లేని భర్తీల గురించి, వసతి సదుపాయాల గురించి ఒకేసారి ప్రస్తావించి లక్ష్యాన్ని తగ్గించమని వ్రాసి పంపండి. కీలెరిగి వాత పెడ్తే కాని కేంద్ర స్థావరానికి తిక్క కుదరదు"

విభీషణశర్మకి తులసీదాసు తర్కం నచ్చింది. నోరు మూసుక్కూర్చుంటే నెత్తి కెక్కుతారన్న విషయం అర్థమైంది. తులసీదాసు తీసుకొచ్చిన డ్రాఫ్ట్ ఉత్తరాన్ని ముందర పెట్టుకొని, స్టెనోని పిలిచి మధ్య మధ్య తులసీదాసు సహాయం తీసుకొంటూ, రెండు విషయాలనీ సమగ్రంగా చర్చిస్తూ ఉత్తరాన్ని డిక్టేట్ చేశాడు. స్టెనో తన గదిలోకివెళ్ళి, దాన్ని లేత నీలం రంగు నోట్ షీట్ మీద టైప్ చేసి, ఫైల్లో పెట్టి విభీషణ శర్మ ముందుంచాడు.

విభీషణశర్మ దాన్ని చదివి, సంతకం చేసి ఫైల్ని తులసీదాసుకిస్తూ,"ఈ ఫైల్ తీసుకొని వెళ్ళి మెంబరు యింజనీరింగ్నీ, ఆ పైన ఛైర్మన్నీ కలిసి, విషయాలన్నీ వివరంగా చెప్పిరా. ఈలోపుగా వాళ్ళిద్దరికీ నువ్వు అక్కడికి వస్తోన్నట్టుగా టెలిఫోన్ చేసి చెబ్తాను" అన్నాడు.

ప్రమోషన్ రాక దెబ్బ తిన్న పులి తులసీదాసు. అందుకని నిర్మొహమాటంగా పెద్దవాళ్ళని దులిపి రావడానికి అతనే తగిన వ్యక్తి అనుకొన్నాడు విభీషణశర్మ. తులసీదాసు ఢిల్లీ వెళ్ళి, తన రీజియనల్ డైరెక్టరు మొహమాటపడి చెప్పలేని విషయాల్ని కూడా ముందుగా మెంబరు యింజనీరింగ్కీ, ఆపైన ఛైర్మన్కీ వినయ విధేయతలతో వివరంగా చెప్పి, ఆ ఫైల్ని వదిలి వచ్చాడు.

ఆరు నెలల్లో రిటైర్ కాబోయే మెంబరు యింజనీరింగ్ యిబ్బందిగా మొహం పెట్టాడు. తులసీదాసుని, విభీషణశర్మని మనసులో తిట్టుకొన్నాడు. ఆర్నెల్లయి మరో ప్రభుత్వ రంగ సంస్థ నుంచి వచ్చిన ఛైర్మన్ ఖురానా చాలా సూక్ష్మగ్రాహి. తులసీదాసు చెప్పిన కథనంతో అతనికి సంగతి అంతా విశదమైంది. మెంబర్లనందర్నీ పిలిచి ఓ అత్యవసర సమావేశం జరిపాడు.

"ఉత్పత్తుల లక్ష్యం తగ్గిస్తే కేంద్రంలోనే కాక, ఆ రాష్ట్రంలోని రాజకీయ నాయకులు కూడా దుమ్ము దులిపేస్తారు. ఉద్యోగాల భర్తీ విషయంలో యింతటి కుంభకోణం జరిగిందని తులసీదాసు చెబ్తేనే కాని తెలిసింది కాదు. మీరందరూ నన్ను అంధకారంలో ముంచివేశారు" - ఖురానా తన కోపాన్ని ప్రత్యేకించి మానవ వనరుల శాఖ మెంబర్ చమన్ చోప్రా మీద చూపించాడు.

"ఏం చేసేది? రాజకీయ పరమైన ఒత్తిళ్ళు చాలా వచ్చాయి!" అన్నాడు చోప్రా

నసుగుతూ.

"ప్రత్యేక పథకంలో ఆ ప్రాంతం కోసం ఉద్యోగాల్లో భర్తీ చేసిన వాళ్ళ నందర్నీ వెంటనే బదిలీ ఉత్తర్వులిచ్చి పంపించండి. నెలరోజుల్లోగా అందరూ అక్కడికి వెళ్ళి చేరాలి!"

"సర్, మళ్ళీ రాజకీయంగా గొడవలొస్తాయేమో? అయినా వసతి సదుపాయం లేకుండా అంతమందిని ఒక్కసారి అక్కడికి పంపడం...." చమన్ చోప్రా చిన్న అడ్డుపుల్ల వెయ్యడానికి ప్రయత్నించాడు.

"అవ్వా కావాలి, బువ్వా కావాలి అంటే కుదరదు! ప్రత్యేక పథకంలో ఉద్యోగాలు సంపాదించి, అక్కడ ఎనిమిది సంవత్సరాల పాటు బదిలీ అడగకుండా ఉంటామని హామీ యిచ్చి, దొడ్డి దారమ్మట యితర ప్రాంతాల్లో కూర్చున్న వాళ్ళు కదిలి తీరాల్సిందే. వాళ్ళకి జీతాలతో పాటు యిళ్ళ అద్దెలు కూడా యిస్తున్నప్పుడు కాలనీలో వసతి సదుపాయం కలిగే దాకా ఎవరి ప్రయత్నాలు వాళ్ళు చేసుకోవాల్సిందే! ఎవరైనా కదలడానికి మొరాయించినా, సిఫారసులు తీసుకువచ్చినా సస్పెండ్ చెయ్యండి!"

ఈ అర్నెల్లలోనూ ఛైర్మన్ ఖురానా అంత కరకుగా మాట్లాడడం చోప్రా యింతవరకూ ఎరగడు. తన బంధువుల తాలూకు అరుగుర్ని, తను అమితంగా ఆధారపడే ఆఫీసర్ల తాలూకు మరికొంతమందినీ ఎలా ఈ ఇబ్బందిలోంచి తప్పించాలా అన్న ఆలోచనలో పడ్డాడు. చాలామంది ఎం.పి.ల ద్వారా, ఎమ్.ఎమ్.ఎ.ల ద్వారా ఒత్తిళ్ళు తీసుకువచ్చారు. వాళ్ళు మళ్ళీ రంగంలోకి దూకుతారు. అప్పుడు కాని ఈ ఛైర్మన్‌కి బుద్ధి రాదనుకొన్నాడు.

చమన్ చోప్రా ఆలోచనల్ని పసిగట్టాడో ఏమో అన్నట్లుగా ఛైర్మన్ ఖురానా మళ్ళీ అన్నాడు.

"మళ్ళీ రాజకీయ పరమైన వొత్తిళ్ళు రావచ్చునేమోనని యిందాకా ఏదో అనబోయారు. మనం చేసిన అవకతవకల్ని వారి మీదకు నెట్టడం కూడా ఈ మధ్య అలవాటైపోయింది. మీరు ప్రత్యేక పథకం కింద ఉద్యోగాలు భర్తీ చేసినప్పుడున్న ప్రభుత్వం యిప్పుడు లేదు. కాని చాలామంది ప్రజానాయకులు కొత్త పార్టీల్లో, కొత్త అవతారాల్లో తిరిగి ఎన్నిక అయే ఉంటారు. వాళ్ళ ద్వారా ఏ విధమైన ఒత్తిడి వచ్చినా మా ఛైర్మన్ ఒప్పుకోడు అని మొదట్లోనే తుంచి పారేయండి. ఏ ఒక్క కేసు నా బల్ల దగ్గరకు వచ్చినా బాధ్యత మీదే! తమ ప్రాజెక్టుకు కేటాయించిన వారందరూ వచ్చి చేరారని విభీషణ శర్మగారి వద్దనుంచి ఉత్తరం వచ్చేవరకూ నేను నిద్రపోను!"

చమన్ చోప్రా నిశ్శబ్దంగా గుటకలు మింగాడు.

తర్వాత ఖురానా మెంబర్ ఇంజనీరింగ్ రామ్‌స్వరూప్‌కేసి చూస్తూ, "కొత్త క్వార్టర్సు నిర్మాణం విషయమై రెండేళ్ళ క్రితం పంపిన ప్రతిపాదనలు యింతవరకూ వెలుగుచూడలేదనీ, అద్దె కొంపల్లో ఉన్న వాళ్ళు అశాంతిగా ఉన్నారనీ, కొత్తగా రాబోయే

వారికి క్వార్టర్సు లేవనీ - ఒకదానికి మరొకటి ముడిపెట్టి లక్ష్యాలు తగ్గించమంటున్నారు. మెషినరీ, ఉత్పత్తులూ, సివిల్ నిర్మాణాలూ అన్నీ మీ ఆధ్వర్యంలోనే ఉన్నాయి! మీ సమాధానమేమిటి?" అని నెమ్మదిగానే అన్నాడు.

"సర్, ఎనిమిదేళ్ళ క్రితం ఆ ప్రాజెక్టు ప్రారంభమైన ఏడాది తర్వాత మొదటి తడవగా వంద క్వార్టర్ల నిర్మాణం జరిగింది. అప్పుడు స్థానికంగా ఉన్న కంట్రాక్టర్లందరూ ఆ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఒత్తిళ్ళు తీసుకువచ్చి రంగంలోకి దిగారు. వారెవరికీ భారీగా పెట్టుబడులు పెట్టే ఆర్థిక స్థోమత లేని కారణంగా, ఏడెనిమిది విడతల్లో నిర్మాణ దశలకి ముందుగానే డబ్బు యివ్వవలసిన పరిస్థితి ఏర్పడింది. ఆ కంట్రాక్టర్లు యిచ్చిన డబ్బుని వెంటనే నిర్మాణానికి ఉపయోగించకుండా వాయిదాలు వేస్తూ వచ్చారు. ఏడాదిలో పూర్తికావలసిన పని నాలుగు ఏళ్ళు పట్టింది! నాణ్యత పూర్తిగా లోపించింది. అదనంగా రెండు వందల క్వార్టర్సు ప్రపోజలు విషయం తెలియగానే అక్కడి కంట్రాక్టర్లు టెండర్లు ఆహ్వానించక మునుపే పావులు కదిపేశారు! మీ క్రితం ఛైర్మన్ రమేష్ సైగల్ సాబ్ ఆ ఫైల్‌ని మూలన పెట్టేయమన్నారు! ఆ విషయమై ముందుగా మీకు చెప్పకపోవడం నా పొరపాటే" అన్నాడు రామ్‌స్వరూప్.

"మరి అటువంటప్పుడు ఆ ప్రాజెక్ట్ ఉత్పత్తి పెంచడానికి నలభై నాలుగు కోట్లు ఖర్చు పెట్టి అదనపు యంత్ర సామగ్రిని ఎందుకు కొన్నట్టు? అంటే అదనపు యంత్రాల కొనుగోళ్ళకీ, మానవ వనరులు, వసతి సదుపాయాలూ కలిగించడానికీ సమన్వయం లేకుండా పోయిందన్నమాట?! ఈ పాటికి యంత్రాలన్నీ గోదాముల్లో తుప్పు పట్టి ఉంటాయి?"

"లేదు ఖురానా సాబ్! వాటిలో సగానికి పైగా వాడుకలో ఉన్నాయి" - సమాధానమిచ్చి వెంటనే నాలిక కొరుక్కున్నాడు.

"అంటే అదనపు యంత్ర సామగ్రిని పాత వాటి స్థానే వాడేస్తున్నారన్నమాట? మిగిలిన సగాన్నీ స్పేర్ పార్ట్సు కింద వాడేస్తారు!"

"పాత యంత్రాల్ని సర్వీస్ చేసి మళ్ళీ తిరిగి వాడకంలో పెట్టవచ్చు!"

"పాత యంత్రాలు ఎంతకాలం క్రితం తొలగించబడ్డాయి?"

"ఏడాది క్రితం"

"అవన్నీ యిప్పటికి సర్వీసింగ్ పూర్తయి సిద్ధంగా ఉన్నాయా?"

రామ్‌స్వరూప్ నీళ్ళు నమిలాడు. వర్క్‌షాప్‌లో తగినంత సిబ్బంది లేదు. అందుకని వాటి సర్వీసింగ్ కుదరలేదు.

ఛైర్మన్ మానవ వనరుల శాఖ మెంబరు చమన్ చోప్రా కేసి చూశాడు కనుబొమలు ఎగురవేస్తూ. చమన్ చోప్రా దోషిలా మౌనంగా ఉండిపోయాడు.

"రాజకీయ నాయకుల జోక్యం లేకుండా, కంట్రాక్టర్ల ప్రభావం లేకుండా మన దేశంలో ఏ నిర్మాణం ముందకు సాగుతుంది కనుక? ఏదో జరుగుతుందని పని ప్రారంభించకపోవడం, యంత్రాలు కొని మనుషుల్ని ఉండీ పంపించకపోవడం రెండూ బుద్ధి తక్కువ పనులే! క్రితం సారి అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని, ఆ ఫైల్‌ని పున: పరిశీలించి చెయ్యాల్సిన మార్పులూ, చేర్పులూ ప్రాజెక్టుని సంప్రదించి చేసి, పదిహేను రోజుల్లో పుటప్ చేసి నా శాంక్షన్ తీసుకోండి. ఈ నిర్మాణంతో సంబంధం లేకుండా అక్కడకు వెళ్ళవలసిన ఉద్యోగులు వెంటనే వెళ్ళి తీరాలి" అని ఖురానా ఆదేశించాడు.

మెంబర్లందరూ మౌనంగా బయటకు దారి తీశారు.

మూకుమ్మడిగా ఒక్కమారు యితర ప్రాజెక్టుల్లో, కేంద్ర స్థావరంలో సర్దుకొని వచ్చిన ఉద్యోగుల్ని స్థానిక నిరుద్యోగులు వీలుదొరికినప్పుడల్లా వాయించడం మొదలు పెట్టారు – మాకు రావలసిన ఉద్యోగాల్ని ఎగరవేసుకొని పోవడమే కాకుండా, రెండేళ్ళ తరువాత బాబుల్లా దిగారంటూ!

దీనికంతటికీ మూలకారణం తులసీదాసనే సీనియర్ ఆఫీసరన్న సంగతి కూపీ లాగిన ఆ కొత్త ఉద్యోగులు ఉడుకుమోత్తనం కొద్దీ తులసీదాసు మీద చెయ్యి చేసుకొన్నారు. విభీషణ శర్మ వారి మీద చాల కఠిన చర్యలు తీసుకొన్నాడు. ఈ విషయమై కేంద్ర స్థావరంలోనూ, ప్రాజెక్టు ప్రాంతంలోనూ అలజడి రేగింది. వెళ్ళి పరిస్థితిని చక్కబెట్టుకు రమ్మని ఛైర్మన్ చోప్రానీ, రామ్‌స్వరూప్‌ని ఆదేశించాడు. వాళ్ళిద్దరికీ గుండె నొప్పిలొచ్చి ఒకరు అపోలో హాస్పిటల్లోనూ, మరొకరు లోహియా హాస్పిటల్లోనూ అడ్మిట్ అయ్యారు!

ఖురానా వెళ్ళి ఆ ప్రాజెక్టులో పది రోజులు కేంప్ వేశాడు. ముందస్తుగా ఆలస్యంగా వెళ్ళి జేరిన ఉద్యోగులందర్నీ ఓ దులుపు దులిపి, తులసీదాసుకి క్షమార్పణ లిప్పించాడు. తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రితోనూ, రాజకీయ నాయకులతోనూ, స్థానిక ప్రముఖులతోనూ, కాంట్రాక్టర్లతోనూ మంతనాలు జరిపాడు. నిష్కర్షగా చెప్పవలసినవన్నీ చెప్పాడు.

"ఆర్థికంగా స్థోమత లేని కాంట్రాక్టర్లు భారీ నిర్మాణ సంస్థలకి సబ్ కంట్రాక్టర్లుగా చేరి ముందుగా అనుభవం సంపాదించండి. ఆర్థికంగా నిలద్రొక్కుకోండి. సహకార సంఘాలు ఏర్పరచుకొని నిర్మాణ సారథ్యం వహించండి. వంద క్వార్టర్ల నిర్మాణంలో ఈ సంస్థకి చాలా నష్టమొచ్చి చేదు అనుభవం మిగిలింది! అరడజను మంది ఆఫీసర్లు వాళ్ళు చెయ్యని తప్పులకి ఆడిట్ పేరాలకి సమాధానలిస్తూ సతమతమైపోతున్నారు. అందుచేత మరో రెండు వందల క్వార్టర్ల నిర్మాణానికి సాహసించలేకపోతున్నాం. వాస్తవానికి ఈ నిర్మాణ కార్యక్రమం ఎంతమంది స్థానిక శ్రామికులకి ఉపాధి కల్పిస్తుందో ఆలోచించండి. ఎంతమంది వ్యాపారులకు సవ్యమైన లాభాలు సమకూరుస్తాయో ఆలోచించండి.

"యిది కేంద్ర ప్రభుత్వాధీన సంస్థ. ఉద్యోగావకాశాలు తరగతుల్ని బట్టి కొన్నింటిని రాష్ట్రానికే పరిమితం చెయ్యడం, మరికొన్నిటిని దేశవ్యాప్తంగా పరిగణించబడడం జరుగుతుంది. దేశవ్యాప్తమైన తరగతులకి బదిలీలు తప్పవు. యితర రాష్ట్రాలలో ఉన్న ఈ సంస్థ ప్రాజెక్టుల్లో మీ రాష్ట్రం వాళ్ళు అయిదు వందల మంది పన్జేస్తున్నారు. ఈ సంగతి మీకు తెలియకపోవచ్చు. అందుకని కళ్ళ ఎదుట నున్న వారినే లెక్క పెట్టకండి! మీ రాష్ట్రం వాళ్ళని మీ కళ్ళ ఎదుటనే ఉంచాలన్న ప్రయత్నంలో ఈ ఏడాది యిరవై మందికి బదిలీ ఉత్తర్వులు జారీచేస్తే, కుటుంబ పరిస్థితుల దృష్ట్యా యిద్దరు వచ్చి చేరారు. మిగిలిన వారు సంసిద్ధత చూపకుండా అర్జీలు పెట్టుకొన్నారు! కారణం?

"కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో ఎవరి రాష్ట్రంలో వాళ్ళు పన్జేస్తే వివాదాంశాలు తలఎత్తి నప్పుడు సంస్థకీ, స్థానికులకీ మధ్య నలిగి మనశ్శాంతిని కోల్పోవడం జరుగుతుంది. యిది ఉద్యోగికీ మంచిది కాదు, సంస్థకీ మంచిది కాదు. రాజకీయాల కతీతంగా యిటువంటి కేంద్ర ప్రభుత్వం సంస్థల్లో ఒక రాష్ట్ర ఉద్యోగులు మరొక రాష్ట్రంలో పన్జేస్తే - పరస్పరావగాహనకీ, జాతీయ సమైక్యతకీ అదో సమున్నతమైన మార్గం.

"మీ రాష్ట్రంలోని ఈ ప్రాజెక్టు పరిసరాల్ని అభివృద్ధి చెయ్యడానికి మాకున్న పరిమితులలో శాయశక్తులా ప్రయత్నిస్తాం. కాని మీరు అడుగడుక్కీ అడ్డు రాళ్ళుగా నిలబడితే అభివృద్ధి సాధ్యం కాదు. నష్టాలతో ఈ ప్రాజెక్టుని నడపడం సాధ్యమూ కాదు, ఎవరికీ మంచిదీ కాదు! ఆ పైన మీ యిష్టం!"

ప్రాజెక్టు మళ్ళీ గాడిలో పడింది. తులసీదాసుకి ప్రమోషనొచ్చింది. విభీషణ శర్మ మెంబరయ్యాడు.

ఉపసంహారం :

ఆ ప్రాజెక్టులో ఎనిమిదేళ్ళ సర్వీసు పూర్తి చెయ్యకుండా రెండేళ్ళ తర్వాత బదిలీ కోసం అర్జీ పెట్టుకున్న ఓ కేంద్రమంత్రి భార్య మేనల్లుడి ప్రయత్నాలు నిర్ద్వంద్వంగా తిరస్కరించబడ్డంతో, ఖురానాని అతని పాత సంస్థకి తరలించారు.

ఆ మంత్రిగారి భార్య మేనల్లుడు కాలరెత్తుకొని బదిలీ మీద ఢిల్లీ వెళ్ళాడు. మళ్ళీ అలజడి రేగింది. అర్జీల వెల్లువ పొంగింది. ఈ మాటు కొంతమంది కోర్టులకి వెళ్ళారు. కొత్తగా వచ్చిన ఛైర్మన్ తల పట్టుకొన్నాడు.

తన పాత సంస్థకి తిరిగి పంపించబడ్డ ఛైర్మన్ ఖురానా, దాని పునరుద్ధరణకి మళ్ళీ నడుం బిగించవలసి వచ్చింది.

తుదీ, మొదలూ తెలియని ఈ జిలేబి పెద్దదవుతూనే వ్యవస్థని దెబ్బతీస్తుంది. ఒక ఖురానా, ఒక తులసీదాసు వ్యవస్థను కాపాడ్డానికి తమ ప్రయత్నాలు చేస్తూనే ఉంటారు.